క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు


ఆలయం వెలుపల అనిరుధ్, సుధ

తిరుమల : తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో జార్ఖండ్ మంత్రి సూర్యరాయ్ , సినీ సంగీత దర్శకుడు అనిరుధ్ , సినీ నటి సుధ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ప్లాట్లు కేటాయించాలని వినతి


వీఆర్‌ఓతో మాట్లాడుతున్న శెట్టిపల్లె మహిళలు

తిరుపతి అర్బన్ : శెట్టిపల్లెలో భూ బాధితులకు పంపిణీ చేసే విధంగానే తమకు ప్లాట్లు కేటాయించాలని పలువురు మహిళలు కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓ ప్రసాద్‌తో తమ గోడు వెళ్లబోసుకున్నారు. శెట్టిపల్లెలో అందరూ భూములు, ఇంటి స్థలాలు కొనుగోలు చేసే సమయంలోనే తాము కూడా కొన్నామని, అయితే తమ 13 మందికి చెందిన పట్టాలను కాలువ పోరంబోకు, మంచినీళ్లగుంటగా చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో తమకు అందరిలాగే 2 సెంట్ల చొప్పున ప్లాట్లు ఇవ్వాలని కోరారు.

ఎల్లమ్మకు పొంగళ్లు


ఆలయానికి ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

చంద్రగిరి : చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మకు శుక్రవారం సామూహిక పొంగళ్లు సమర్పించారు. స్థానిక జమండ్లవీధికి చెందిన భక్తులు ముందుగా బలిదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు దెయ్యాల మాధవరెడ్డి, పినపెద్ద మొక్కల రాజా రెడ్డి, తానాటి చంద్రశేఖర్ రెడ్డి, మట్టిరెడ్డి నవీన్ పాల్గొన్నారు.

రూ.లక్ష బీమా పంపిణీ


బషీర్ (ఫైల్)

చంద్రగిరి: ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థి బషీర్(16) ఈ ఏడాది ఏప్రిల్ 28వ తేదీన బావిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విద్యార్థి పేరు మీద ప్రిన్సిపల్ భక్తవత్సలం బీమా చేయించారు. శుక్రవారం ఈ మేరకు విద్యార్థి కుటుంబీకులకు రూ.లక్ష బీమా సొమ్మును అందించారు. పాలిటెక్నిక్‌లోని విద్యార్థులందరితో బీమా చేయించిన ప్రిన్సిపల్‌ను పలువురు ప్రశంసించారు.

సోనికా బొడ్కేకు డాక్టరేట్



తిరుపతి రూరల్ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయ శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థిని సోనికా బొడ్కేకు డాక్టరేట్ ప్రదానం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఇందిరా ప్రియదర్శిని పర్యవేక్షణలో 'లీగల్ పెరెస్పెక్టివ్స్ ఆఫ్ మనీ లాండరింగ్ ఇన్ ఇండియా' అనే అంశంపై ఆమె పరిశోధన పత్రాలు సమర్పించారు.

నైపుణ్యం తప్పనిసరి

తిరుపతి సిటీ : విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యతోపాటు ప్రత్యేక నైపుణ్యం తప్పనిసరని ఎస్పీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ తెలిపారు. శుక్రవారం పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై సంకల్ప మిషన్ శక్తి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి లోకనాథం పాల్గొన్నారు.

భాగ్యవల్లికి సత్కారం


భాగ్యవల్లిని సన్మానిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలక మండలి సభ్యులుగా నియమితులైన భాగ్యవల్లిని శుక్రవారం బ్రాహ్మణ సంఘాల నేతలు ఘనంగా సత్కరించారు. నేతలు వేదం హరిప్రసాద్, కృష్ణమూర్తి, భాగ్యలక్ష్మి, డి.కృష్ణ, హరికుమార్ పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ కమిటీ నియామకం

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఎస్.మహేష్ యాదవ్, ఎం.గుణ, జి.భాగ్యవల్లి, బి.సుబ్రమణ్యం, రాజరుద్ర కిషోర్, ఏ.వరలక్ష్మి, పి.విమల, టి.చంద్రశేఖర్, ఎన్.శ్యామల, యు.మధులత, ఇ.లక్ష్మణరావు.. మొత్తం 11 మందిని నియమిస్తున్నట్లు పేర్కొంది.

ఆర్‌టీసీ స్థలం..
వ్యాపారుల ఆధీనం!


వ్యాపారులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి కంచెతో ఏర్పాటు చేసుకున్న స్థలం

నిత్యం లక్షలాది మంది యాత్రికులు రాకపోకలు సాగించే తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో కొందరు వ్యాపారులు హల్‌చల్ చేస్తున్నారు. ఆర్‌టీసీ స్థలాలను తమ ఆధీనంలోకి తీసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమ అనుమతి లేకుండా ఎవరైనా వాహనాలు నిలిపితే దౌర్జన్యానికి దిగుతున్నారు. ప్రశ్నించిన అధికారులను మంత్రి.. ఎమ్మెల్యే పేర్లు చెప్పి బెదిరిస్తున్నారు.అడ్డుకోవాలని యత్నిస్తే ఉద్యోగులపై సైతం దాడులకు పాల్పడేందుకు తెగబడుతున్నారు. కూటమి నేతల అండదండలతో పలువురు దుకాణదారుల రౌడీయిజానికి ఉన్నతాధికారులు సైతం హడలిపోతున్నారు. సామాన్య ప్రయాణికులైతే నోరెత్తేందుకు కూడా వణికిపోతున్నారు.

- రెచ్చిపోతున్న దుకాణదారులు
- మంత్రి, ఎమ్మెల్యే పేర్లతో బెదిరింపులు
- ప్రశ్నించిన అధికారులపై జులుం
- అడ్డుకునేందుకు వెనుకంజ వేస్తున్న ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్ వ్యాపారుల చేతుల్లో చిక్కుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ప్రధానంగా బస్టాండ్‌లో షాపులను నిర్వహించుకునే వ్యాపారులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు దక్షిణం వైపుగా ఆర్‌టీసీ కొంత స్థలం కేటాయించింది. అయితే ఇతరుల వాహనాలు ఆ ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయడానికి వీలులేకుండా వ్యాపారులు కంచె ఏర్పాటు చేశారు. దుకాణదారులకు చెందిన వాహనాలు వస్తే మాత్రమే కంచెకు వేసిన తాళం తీసి... పార్కింగ్ చేయడానికి అనుమతిస్తున్నారు. దీనిపై పలు పత్రికల్లో సైతం కథనాలు ప్రచురిస్తున్నారు. పలువురు ప్రయాణికులు సైతం ఈ అంశంపై అధికారులను ప్రశ్నిస్తున్నారు.పొరబాటున ఎవరైనా ఖాళీ స్థలంలో స్కూటర్లు పార్కింగ్ చేస్తే గాలి తీసేస్తున్నారు. దీంతో పలువురు వాహనదారులు ఆర్టీసీ అధికారులకు శుక్రవారం ఫిర్యాదులు చేశారు.

ఏం చేయలేం!

ఈ అంశంపై పలువురు ఆర్టీసీ సిబ్బంది ఏమంటున్నారంటే రకరకాలు స్పందిస్తున్నారు. ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలానికి సంబంధించి వ్యాపారులను ప్రశ్నిస్తే...వాళ్ల వెంటనే ఓ మంత్రి, మరో ఎమ్మెల్యే చేత మాకు ఫోన్లు చేయిస్తున్నారు. నేతల ఒత్తిడి నేపథ్యంలో ఖాళీ స్థలం అంశంపై జోక్యం చేసుకోలేకపోతున్నామని స్పష్టం చేస్తున్నారు. ఫిర్యాదులు చేసిన వారికి ఈ విధంగా ఆర్టీసీ సిబ్బంది సమాధానం చెప్పేస్తున్నారు. అధికారులు సైతం వ్యాపారులు ఏర్పాటు చేసిన కంచెను తొలగించేందుకు భయపడుతున్నారు. బస్టాండ్‌లో సాధారణ ప్రయాణికులకు వీలుగా సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు సైతం ఇలా నేతల ఒత్తిడితో వెనుకడుగు వేయడంపై పలు విమర్శలు వస్తున్నాయి. తిరుపతి బస్టాండ్ నుంచి రోజుకు 1.60 లక్షల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే కూటమి నేతల ఒత్తిడి కారణంగా వ్యాపారుల జోలికి వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతుండడం గమనార్హం.

నోటీస్ బోర్డు

- మహతి కళాక్షేత్రంలో రెండో రోజు ఉదయం 9.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు నృత్య ప్రదర్శనలు.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9.30 గంటలకు 'ఉగ్గుపాల నుండే' కవితా సంపుటి పుస్తకం ఆవిష్కరణ.
- ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం10 నుంచి రాత్రి 8 గంటల వరకు రెడ్ కార్పెట్ బిగ్గెస్ట్ జ్యూవెలరీ ఎగ్జిబిషన్.
- తిరుపతిని రౌడీ మూకల నుంచి కాపాడాలని కోరుతూ వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు శాంతియుత ప్రదర్శన.
- ఆర్టీసీ టర్మినల్‌లో ఉదయం 9.30 గంటలకు ప్రాంతీయ సులభతర వాణిజ్య అవగాహన సదస్సు.
- తిరుచానూరు జెడ్పీ హైస్కూల్ ఉదయం 10 గంటలకు అండర్ –14,17,19 బాలికల బాక్సింగ్ పోటీలు.
- బైరాగిపట్టెడలోని పోయేస్ అకాడమీలో ఉదయం 10 గంటలకు లాన్ టెన్నిస్ ఎంపిక పోటీలు.
- తాతయ్యగుంట గంగమ్మ ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు టీడీపీ రజక సంఘ నేతల నిరసన.

సీతారాం ఏచూరికి ఘన నివాళి


సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ మాజీ అఖిల భారత అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు, దేశ ప్రజాస్వామ్య పోరాట యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరికి వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ ప్రకాశం భవన్ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థి జీవితం నుంచి ఎస్ఎఫ్ఐ నాయకుడిగా పోరాటాలు చేసి పేద, బడుగు బలహీనవర్గాల కోసం నిర్విరామ కృషిచేసిన మహానీయుడిని కొనియాడారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. ప్రతి విద్యార్థి ఆయను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి వినోద్, అధ్యక్షుడు నరసన్న, నాయకులు అశోక్, వాసు, చక్రి, శశావాలి, అనిల్, భాను విజయ్, శ్రీకాంత్, మాంతేశ్వరి, రాజు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా నృత్య పోటీలు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలను శుక్రవారం మహతి కళాక్షేత్రంలో వేడుకగా ప్రారంభించారు. బీజేపీ నేత పి.నవీన్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే నృత్య కళను పరిరక్షించి భావితరాలకు అందించాలన్నారు. 35 ఏళ్లుగా రంగస్థలి నృత్య కళోత్సవాల పేరుతో జాతీయ స్థాయి పోటీలు చేపడుతున్న నిర్వాహకులు అభినందనీయులని కొనియాడారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన నృత్య పోటీలలో సుమారు 220 మంది కళాకారులు పాల్గొన్నారు. చిన్నారులు తమ నృత్యాభినయంతో అలరించారు. కళాకారులను రాయలసీమ రంగస్థలి ప్రతినిధులు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఉమా ముద్దుబాలకు నాట్య విద్వన్మణి, దేవరకొండ శ్రీనివాసవెంకట రమణారావుకు కవి పురస్కారం, పి.ప్రవీణ్ కుమార్ యువ నాట్యాచార్య పురస్కారం ప్రదానం చేశారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్ రాజా, సుబ్రమణ్యం యాదవ్, సురేష్ స్వామి, సుబ్రమణ్యంరెడ్డి, శేఖర్, ఆమూరి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం


ప్రభుని సత్కరిస్తున్న నేతలు

పాకాల : ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిన్నగోర్పాడు ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం మనేరి ప్రభుని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయం సంఘం సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్, రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకోట రామమూర్తి, యువరాజ్, రాజమ్మ, చంద్రశేఖర్, రామయ్య, వెంకటస్వామి, రాజేంద్ర పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ చోరీ

తిరుపతి క్రైమ్ : నగరంలోని అమెరికన్ బార్ సమీపంలోని గోవిందనగర్‌లో రంగమ్మ(74) అనే వృద్ధురాలి మెడలో చైన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. శుక్రవారం ఆమె ఇంటి బయట నిలబడి ఉండగా ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు 30 గ్రాముల బంగారు చైన్ లాక్కుని వెళ్లిపోయారు. బాధితురాలి కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అలిపిరి ఎస్ఐ లోకేష్ తెలిపారు.

రజకులపై వివక్ష తగదు


మాట్లాడుతున్న శంకరన్ తదితరులు

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ పాలకమండలిలో రజకులకు స్థానం కల్పించకపోవడం దారుణమని, ప్రభుత్వం ఇలా వివక్ష చూపడం తగదని రజక సంఘం నేతలు మండిపడ్డారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నేతలు ఎస్.శంకరన్, అక్కినపల్లి లక్ష్మయ్య, కె.సుధాకర్ మాట్లాడారు. టీడీపీలో పలువురు రజకులు ఏళ్ల తరబడి సేవలందిస్తున్నారన్నారు. ఈ క్రమంలో రజక నేత వి.అశోక్‌కు గంగమ్మ ట్రస్ట్ బోర్డులో స్థానం కల్పించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జికి విన్నపాలు సమర్పించామని వెల్లడించారు. అయినప్పటికీ తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం 10 గంటలకు గంగమ్మ ఆలయం వద్ద నిరసనకు దిగనున్నట్లు తెలిపారు. నేతలు గంధం బాబు, శ్రీను, రాజయ్య, దినేష్, గుణశేఖర్, గంధం వెంకటముని, అశోక్ పాల్గొన్నారు.

'రెడ్ కార్పెట్' జ్యువెలరీ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్ ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రెడ్ కార్పెట్ బిగ్గెస్ట్ జ్యూవెలరీ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రెడ్ కార్పెట్ నిర్వాహకులు ఆర్‌కే. నాయుడు, జైలజా రామ్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌కు నగర వాసుల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ప్రదర్శనకు హాజరైన వారికి లక్కీ డ్రా ద్వారా డైమండ్ రింగ్ గెలుపొందే అవకాశం కల్పించామని వెల్లడించారు. గోల్డ్, డైమండ్స్, పోల్కి, జెమ్స్‌కు సంబంధించిన 30కి పైగా స్టాల్స్ ఎగ్జిబిషన్‌లో ఉన్నట్లు వివరించారు. శనివారం, ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

దోబీ ఘాట్ పరిరక్షణే లక్ష్యం


ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న నేతలు

తిరుపతి రూరల్/ తిరుపతి కల్చరల్: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీలోని దోబీ ఘాట్ పరిరక్షణే లక్ష్యంగా కృషి చేస్తున్నామని సీపీఎం నేతలు జయచంద్ర, సునీల్, రజక సంఘాల జేఏసీ నేత గడికోట చిన్నబాబు స్పష్టం చేశారు. శుక్రవారం ఆక్రమణకు గురైన దోబీఘాట్ స్థలాన్ని పరిశీలించారు. 214 సర్వే నంబర్‌లో 56 సెంట్ల భూమిని రజకులకు 2006లో అప్పటి ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. కోర్టు కూడా రజకులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని వెల్లడించారు. బీసీ కార్పొరేషన్ నుంచి బోరు వేసేందుకు రూ.లక్ష మంజూరు చేసినట్లు వివరించారు. అయితే కూటమి నేతలు దీనిపై కన్నేశారని ఆరోపించారు. దోబీ ఘాట్ స్థలానికి ఆక్రమించారని మండిపడ్డారు. ఇందులో ఇల్లు నిర్మిస్తున్న చంద్ర ముదిరాజ్, మాజీ సర్పంచ్ చిరంజీవిరెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నేత కె.సుమన్, రజక సంఘం నేతలు జి.శంకర్, మధు, కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

'ప్యాకేజీ' పునరుద్ధరణకు వినతి

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : టీటీడీకి సంబంధించిన పర్యాటక కేంద్రాల ప్యాకేజీ దర్శనాలను పునరుద్ధరించాలని గైడ్స్ యూనియన్ నేతలు కోరారు. శుక్రవారం ఈ మేరకు మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం అందించారు. ప్యాకేజీ దర్శనాలను టీటీడీ రద్దు చేయడంతో వీధిన పడ్డామని, కుటుంబాలను పోషించుకోలేని దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

'ప్రీ రిపబ్లిక్ డే పరేడ్'కు ఎంపికలు


ఎంపిక ప్రక్రియలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

తిరుపతి రూరల్: పద్మావతీ మహిళా విశ్వ విద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులను ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంప్‌నకు ఎంపిక చేపట్టారు. శుక్రవారం వర్సిటీ మైదానంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామకృష్ణ పలు సూచనలు అందించారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ వలంటీర్లు నిబద్ధతతో పనిచేస్తూ ఉత్సాహంగా ఉండాలన్నారు. ఎంపిక ప్రక్రియలో సుమారు 60 మంది వలంటీర్లు తమ ప్రతిభను ప్రదర్శించారు.

టీటీడీ ఈఓను కలిసిన ఉద్యోగులు


ఈఓ సింఘాల్‌తో నేతలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : టీటీడీ పరిపాలన భవనంలో ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్‌ను శుక్రవారం టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్ల సంఘం నేతలు కలిశారు. నేతలు విజయ్ కుమార్, శ్రీ దొరై రాజు, కుమారస్వామి, రామకృష్ణ, మునుస్వామి, కుమార్, రాంప్రసాద్, తులసిరామ్ పాల్గొన్నారు.

మెనూ డిస్‌ప్లే తప్పనిసరి


మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల : మధ్యాహ్న భోజనం పథకం కింద విద్యార్థులకు వడ్డించే మెనూను తప్పనిసరిగా డిస్‌ప్లేలో ఉంచాలని ఎంఈఓ బాబ్జీ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మొగరాల, రమణయ్యగారిపల్లె, కొండేపల్లె, పాకాల ఎస్‌వీఎస్ పాఠశాలలను సందర్శించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యంపై ఉపాధ్యాయులకు అవగాహన అవసరమన్నారు. ప్రధానోపాధ్యాయులు సైతం విధిగా పాఠ్యాంశాలు బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులందరూ మాడ్యుల్స్ రాయాలని, రికార్డులను అప్‌డేట్‌గా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. హెచ్‌ఎంలు జిలానీ, దయానందనాయుడు, రామకృష్ణ, భాస్కర్‌రెడ్డి, రోహిణీకుమారి పాల్గొన్నారు.

క్యాలెండర్ల పంపిణీ

మండలంలోని అన్ని పాఠశాలలకు విషయ క్యాలెండర్లు సరఫరా పంపిణీ చేసినట్లు ఎంఈఓ–2 లింగయ్య తెలిపారు. శుక్రవారం విద్యవనరుల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ క్యాలెండర్‌లో సూచనల మేరకు పాఠ్యాంశాలు బోధించాలని ఆదేశించారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులతో ఉపాధ్యాయులు

చంద్రగిరి : మండలంలోని దోర్నకంబాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన కంప్యూటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించారు. శుక్రవారం ఈ మేరకు పాఠశాలలో విద్యార్థులను అభినందించి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎంఈఓలు లలితకుమారి, భాస్కర్‌బాబు, హెచ్‌ఎం జగదీష్ పూర్వ విద్యార్థి బైరెడ్డి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఎంఈఓలు మాట్లాడుతూ భానుప్రకాష్ వితరణగా అందించిన 10 కంప్యూటర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఏ1 ఫర్ ఏఐల్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని వెల్లడించారు.

హస్తకళ మేళా ప్రారంభం


మేళాను ప్రారంభిస్తున్న ఏఓ ఖాదర్‌వలీ

తిరుపతి కల్చరల్ : సంస్కృతి కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖాదీకాలనీలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ మేళాను పుటపర్తి శిల్పారామం ఏఓ ఖాదర్ వలీ ప్రారంభించారు. సొసైటీ కార్యదర్శి పైడి మహేష్ మాట్లాడుతూ మేళా 18 రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని వెల్లడించారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఆధునాతన డిజైన్ల వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్, గృహోపలంకరణ వస్తువులు, బొమ్మలు లభిస్తాయని వివరించారు.

వెటర్నరీ డీన్‌గా గంగరాజు

చంద్రగిరి : ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ డీన్‌గా గంగరాజును నియమిస్తూ రిజిస్ట్రార్ డాక్టర్ వినూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డీన్‌గా పనిచేస్తున్న రవీంద్రా రెడ్డి పదవీ కాలం శుక్రవారంతో ముగిసింది. వెటర్నరీ సైన్స్ అధ్యాపకుడు డాక్టర్ గంగరాజును రెండేళ్ల పదవీ కాలంతో డీన్‌గా నియమించారు. రవీంద్రా రెడ్డి కళాశాలలోని లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ విభాగంలో ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు.

ఘనంగా ప్రథమ చికిత్స దినోత్సవం



మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ జనార్ధనరాజు

తిరుపతి సిటీ : ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సెట్విన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రథమ చికిత్స దినోత్సవంనిర్వహించారు. ఎస్వీ మెడికల్ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ బి.జనార్ధన రాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రాణరక్షణలో ప్రథమ చికిత్స ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథ్‌రెడ్డి, సెట్విన్ సీఈఓ మోహన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

'సప్తగిరి'కి ఎల్‌హెచ్‌బీ బోగీలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుపతి– ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మధ్య నడిచే సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌కు కొత్తగా ఎల్‌హెచ్‌బీ బోగీలను అమర్చనున్నారు. ఈ కోచ్‌లు ఎక్స్‌ప్రెస్‌కు రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ఈ నెల 20వ తేదీన ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నట్లు అధికారులు వెల్లడించారు. 16053/16054, 16057/16058 నంబర్ల సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లు ఇకపై ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడుస్తాయి. ఈ మేరకు రైళ్ల కూర్పులో మార్పులు ఉంటాయి, ఇందులో ఒక ఏసీ చైర్ కోచ్, 10 చైర్ కార్ కోచ్‌లు, 4 జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో పాటు అదనంగా దివ్యాంగులకు అనుకూలంగా ఒక సెకండ్ క్లాస్ కోచ్, ఒక లగేజ్ కమ్ బ్రేక్ వ్యాన్ కూడా ఉంటాయి.

విలాసవంతంగా..

ఈ బోగీలను జర్మనీకి చెందిన లింకె–హాఫ్మన్–బుష్క్ సంస్థ డిజైన్ చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. చెన్నై, పంజాబ్‌లోని కపుర్తలా, రాయ్‌బరేలీల్లో గల రైల్వే కోచ్ ఫ్యాక్టరీల్లో ఈ బోగీలు తయారవుతాయి. ఐసీఎఫ్ రూపొందించిన బోగీలతో పోల్చుకుంటే ఈ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు మరింత సౌకర్యంగా విలాసవంతంగా ఉంటాయి.

విశ్రాంత ఉద్యోగుల కృషిని మరువలేం


జ్యోతి ప్రజ్వలనలో వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ఎస్వీయూ అభివృద్ధికి విశ్రాంత ఉద్యోగులు చేసిన కృషిని ఎన్నటికీ మరువలేమని వీసీ అప్పారావు తెలిపారు. శుక్రవారం వర్సిటీ సెనెట్ హాల్‌లో విశ్రాంత ఉద్యోగుల సంఘం వారు యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. 35 మందిని సత్కరించారు. వీసీ మాట్లాడుతూ ఉద్యోగుల సేవలను కొనియాడారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ దేవేంద్రనాథ్, జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, సుబ్రమణ్యం రెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

తిరుపతి లీగల్ : తిరుమలలోని ఓ ఇంట్లో బంగారు నగలు, నగదు చోరీ చేసిన కేసులో మెట్టు కిషోర్‌రెడ్డి అనే నిందితుడికి ఈ నెల 25వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.కోటేశ్వరరావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఎం.మహేంద్ర ఇంట్లో 20 గ్రాముల నగలు, రూ.25 వేల సొమ్ము అపహరణకు గురైంది. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు కిషోర్ రెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన


మాట్లాడుతున్న కోర్ ఎన్‌జీఓ సభ్యులు

పాకాల : ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎయిడ్స్ నియంత్రణపై శుక్రవారం కోర్ సంస్థ ఆధ్వర్యంలో ఐఈసీ క్యాంప్ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కోర్ ఎన్‌జీఓ ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మి, పీర్ ఎడ్యుకేటర్ బాలాజీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అలవాటు, సరైన రక్షణ లేని లైంగిక కార్యకలాపాల కారణంగా తలెత్తే అనర్థాలను వివరించారు. రక్త మార్పిడిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు,అధ్యాపకులువిజయలక్ష్మిదేవి పాల్గొన్నారు.